17

# మనసూ - మదింపు

'మీకు పుణ్యముంటుంది, నా మాట వినరా?' అంది రాజేశ్వరి.

ఆ కంఠంలో బ్రతిమాలుతున్న ధోరణి ఉంది. కాసింత కోపం, కాసింత బెదిరింపు కూడా ఉన్నాయి.

మూడు రసాలు ముచ్చటగా రాజేశ్వరి కంఠంలో వ్యక్తమవుతున్నాయంటే, రాజేశ్వరి కోపం క్లైమాక్సు చేరడానికి అట్టే సేపు పట్టదని రాఘవరెడ్డికి తెలుసు.

'కట్టుకున్న పెళ్ళాంమాట వింటే పుణ్యమొస్తుందని ఏ శాస్త్రాలూ ఘోషించినట్టు వినలేదే?' అన్నాడు రాఘవరెడ్డి నవ్వుతూ.

'పరాచికాలు మాని నేను చెప్పేది వినిపించుకుంటారా, లేదా?' అంది తీక్షణంగా రాజేశ్వరి.

'సరే, ఎందుకొచ్చిన రగడ. ఏం చెయ్యమంటావో చెప్పు, అలాగే చేస్తాను.'

'ముందు ఈ వంటిపేట గొలుసు తీసుకెళ్ళి అమ్ముకురండి' అంది రాజేశ్వరి.

'మళ్ళీ మొదటికే వచ్చావు'.

'సరే. నేను మళ్ళీ మొదటిపాటే మొదలు పెట్టనుగానీ, మీకు బ్యాంకులో ఎక్కౌంట్ ఏమన్నా ఉందేమో చూడండి' అంది రాజేశ్వరి.

'నాకు బ్యాంకులో ఎక్కౌంట్ లేదు. అందుకు నేను బాధ్యుణ్ణి కాదు. మహాతల్లివి నువ్వు అడుగుపెట్టిన వేళా విశేషం నేనేం చెయ్యను?' రాజేశ్వరి ఎలా రియాక్టు అవుతుందోనని, రాఘవరెడ్డి రాజేశ్వరి ముఖంలోకి చూచాడు. తను వేసింది బ్రహ్మాస్త్రం. దానికి తిరుగులేదు. ఎక్కడ తగలాలో అక్కడ తగిలింది.

రాజేశ్వరి గుడ్లమీద నీరు పొరాడుతోంది.

రాఘవరెడ్డి నాలుక కరచుకున్నాడు. 'రాజేశ్వరీ! నేను తమాషాకన్నాను. దానికే కంటతడి పెడతావెందుకు?' అన్నాడు.

'మీకు తమాషాగానే ఉంటుంది. నాకు ప్రాణం పోతుంది.' అంది కన్నీరు వేలితో తడుచుకుంటూ.

'ప్రాణం పోవడమెందుకు? ఈ దేశంలో కోట్లాదిమందికి బ్యాంకులో ఎక్కౌంటులేదు. రోజుకు యాభై అరవై పైసల ఆదాయం మీద నికృష్టంగా జీవిస్తున్నారు. దీనికంతటికి కారణం ఏ వేళా విశేషమో, ఖర్మో అనుకుంటే ఈ దేశాన్ని దేవుడు కూడా రక్షించలేడు.'

'అన్ని మాటలూ మీరే చెపుతారు. మీతో వాదించలేను. ముందు ఈ గొలుసు బజారుకు పట్టుకెళ్ళండి' అన్నది.

రాఘవరెడ్డి మనసు చివుక్కుమంది. పెళ్ళయిన తర్వాత రాజేశ్వరికి తను నగా, నట్రా ఏమీ చేయించలేదు, చేతుల్లో గాజులుంటే అవీ అమ్మాడు. మిగిలింది ఈ వంటిపేట గొలుసు. దాన్నయినా అమ్మడానికి అంత బాధగా ఉండకపోవును – ఇప్పుడు అమ్మవలసిన అత్యవసర పరిస్థితి ఏమీ ఏర్పడలేదు. రాజేశ్వరి పెదనాన్నగారి కూతురిది పెళ్ళి. ఆ పెళ్ళికి వెళ్ళవలసిన బాధ్యత ఉంది. కాని రాజేశ్వరి వట్టిచేతులతో వెళ్ళకూడదంటుంది. పెళ్ళిలో కనీసం నూటయాభై రూపాయల చీరో, ఒక ఉంగరమో చదివించాలంటుంది.

'చేతిలో డబ్బు లేదు. మరీ అంత భారీగా చదివించకపోతే నేం?' అన్నాడు రాఘవరెడ్డి.

రాజేశ్వరికి రాఘవరెడ్డి వాదన నచ్చలేదు.

'ఏదో పదో చదివిస్తే, పదిమందిలో నామోషి పెదనాన్న గారి దృష్టిలో కూడా పలుచన అవుతాం' అంది.

'మనసులో ఆత్మీయతా, అనురాగం ఉండాలి. ఈ చదివింపుల్లో ఏముంది. ఏదో సాంప్రదాయం' అని కొట్టిపారవేశాడు.

రాజేశ్వరి పట్టిన పట్టు వదల్లేదు. చివరకు రాఘవరెడ్డి రాజేశ్వరి ఇచ్చిన గొలుసు బజారుకు తీసుకెళ్ళి అమ్మకా తప్పలేదు.

తరుగులూ, మదుపులూ అన్నీ పోనూ చేతికి మూడువందల యాభై రూపాయలు వచ్చాయి. నూట డెబ్భై రూపాయలు పెట్టి చీర కొన్నాడు.

చీర చూచి రాజేశ్వరి సంతోషించింది.

'మీ బట్టలూ అవీ అన్నీ సర్ది రెడీగా ఉంచాను. భోంచేసి బయలుదేరండి' అంది.

'అదేమిటి, రేపు ఉదయం బయలుదేరినా సరిపోతుంది కదా?' అన్నాడు.

'లేదు. మీరు మధ్యలో పొద్దుటూరులో దిగండి. రామలక్ష్మి కూడా వస్తుందట. ఇద్దరూ కలిసి వెళ్ళండి' అన్నది.

రామలక్ష్మి – రాజేశ్వరి చెల్లెలు. రామలక్ష్మి మొగుడు తాలూకాఫీసులో గుమాస్తా. ఆయనకు సెలవు దొరకలేదేమో – రామలక్ష్మిని పంపిస్తున్నాడేమో అనుకున్నాడు రాఘవరెడ్డి.

నే నొక్కణ్ణే స్వేచ్ఛగా వెళ్దామనుకుంటే మళ్ళీ ఇదొకటా బరువు' అన్నాడు విసుగ్గా రాఘవరెడ్డి.

'బరువా? దాన్ని మీరేం మొయ్యనవసరం లేదు. దాని కాళ్ళమీద అది వస్తుంది, కాస్త తోడుగా ఉంటారని, అక్కడ దిగమని ఉత్తరం రాసింది. అందుకే మీకు బద్ధకమైతే ఎలాగండీ!' అంది.

రాఘవరెడ్డి నోరెత్తలేదు. పెళ్ళాం ఆదేశాన్ని శిరసావహించక తప్పదు. భోంచేసి బయలుదేరాడు. చీకటి పడేసరికి ప్రొద్దుటూరికి వచ్చాడు.

'రామలక్ష్మి! ప్రొద్దున్నే ఎనిమిదింటికి బస్సు ఉంది. దానికి బయలుదేరితే, ముహూర్తం టైంకు ఒక గంటముందే చేరవచ్చు' అన్నాడు రాఘవరెడ్డి.

'నా ప్రయాణం ఇంకా పెండింగులోనే ఉంది. భోంచేసి మాట్లాడుకుందాములే బావా!' అంది రామలక్ష్మి.

భోజనాల తర్వాత రామలక్ష్మి మొగుడు కోటిరెడ్డి, రాఘవరెడ్డీ పిచ్చాపాటి మాట్లాడుకుంటున్నారు. రామలక్ష్మి భోంచేసి వంటిల్లు సర్ది వచ్చింది.

'ఏమ్మా! నీ ప్రయాణం సంగతి ఏం చేశావు?' అన్నాడు రాఘవరెడ్డి.

'ఏమండీ, నా మాటవిని మీరు వెళ్ళిరండి' అంది రామలక్ష్మి మొగుణ్ణి ఉద్దేశించి.

'తెల్లవార్లూ రామాయణం విని సీత రాముడికి ఏమవుతుందన్నాడట వెనకటికెవడో. నీ వరస చూస్తే అలాగే ఉంది మొన్నటి నుంచీ చెబుతున్నాను – అయినవాళ్ళెవరన్నా చావు బ్రతుకుల్లో ఉంటే లీవు దొరుకుతుందేమోగాని, పెళ్ళిళ్ళకు లీవు దొరకదని. లీవు దొరికితే లక్షణంగా వెళ్తును' అన్నాడు కోటిరెడ్డి.

'పోనీ నువ్వు వస్తే వచ్చిన నష్టమేమిటి రామలక్ష్మి?' అన్నాడు రాఘవరెడ్డి.

'నిజం చెప్పనా బావా! నాకూ రావాలనే ఉంది. అదీ, నేనూ స్కూలు ఫైనలు వరకు కలిసి చదువుకున్నాం. ఒకచోట తిన్నాం. ఒకచోట పడుకున్నాం. ప్రాణానికి ప్రాణంగా ఉన్నాం. అది లక్షణంగా బి.ఏ. చదువుకుంది. మంచి వరుడు దొరికాడు. పెళ్ళి అవుతోంది. కళ్ళారా చూచి ఆనందిద్దామనే ఉంది....'

'మరి ఏమిటమ్మా అభ్యంతరం?' అన్నాడు రాఘవరెడ్డి.

రామలక్ష్మి సంకోచిస్తూ అంది. 'కట్టుకునేందుకు ఒక్కటంటే ఒక్కటి మంచి చీరలేదు. వంటిమీద తాళిబొట్టుతప్ప వీసమెత్తు బంగారం లేదు. పెళ్ళికి ఎలా రావడం బావా?' అంది.

'ఇక చాల్లే నోరు మూసుకో. నువ్వు యే చీర కట్టుకున్నావో, యేం నగలు పెట్టుకున్నావో చూడటమే పెళ్ళికొచ్చినవారి పనా? మీరైనా చెప్పండి' అంటూ రాఘవరెడ్డి వైపు తిరిగాడు కోటిరెడ్డి.

రాఘవరెడ్డి సన్నగా నవ్వి ఊరుకున్నాడు. రామలక్ష్మి చెప్పిందాంట్లో ఔచిత్యం లేకపోలేదు. ఆడవాళ్ళు పెళ్ళికంటూ బయలుదేరితే – చీరెలూ, నగలూ ఎగ్జిబిట్ చెయ్యాలనే ఉద్దేశంతోనే వస్తారు. ఖరీదయిన నగలూ, చీరెలూ లేని తోటి ఆడవాళ్ళని చిన్నచూపు చూస్తారు. అందుకే ఒకింట్లో పెళ్ళి జరిగితే - పదిమంది ఇళ్ళల్లో అనేక సమస్యలు.

'ఏది ఏమైనా పెళ్ళికి రాకతప్పదు గదా, రామలక్ష్మి!' అన్నాడు రాఘవరెడ్డి.

'రాక తప్పదు, అక్కయ్య తెలివైంది, నిన్ను పయనం చేసి పంపింది' అన్నది.

'మీ అక్కయ్య తెలివిని ప్రశంసిస్తున్నావా! చదివింపులకని నూటా డెబ్బై రూపాయల చీరె కొనిపించింది. ఆ డబ్బుతో ఒక నెల బత్తెం కొనవచ్చు' అన్నాడు రాఘవరెడ్డి నవ్వుతూ.

ఈ వార్త వింటూనే రామలక్ష్మి ఖంగు తింది. కాసేపు ఏమీ మాట్లాడలేదు. కాసేపటికి నోరు పెగల్చి 'నిజంగా నూట డెబ్భై రూపాయల చీర చదివిస్తున్నావా? లేక తమాషా కంటున్నావా బావా?' అంది.

'నిజమే నమ్మా. ఎందుకొచ్చింది నీకు సందేహం?' అన్నాడు రాఘవరెడ్డి.

'చదివింపులకు మా దగ్గర పదిరూపాయలంటే పదిరూపాయలే ఉంది. పది రూపాయలకు మంచి రవిక గుడ్డన్నా రాదు. ఎన్ని సమస్యలో చూడు బావా!' అంది.

'ఆలోచిస్తే అన్నీ సమస్యలే. ఇక పడుకో' అన్నాడు కోటిరెడ్డి. రామలక్ష్మి వెళ్ళి పడుకుంది.

ప్రొద్దున్నే ఎనిమిదింటికి ఉన్నవాటిల్లో మంచి బట్టలు సర్దుకొని రామలక్ష్మి ప్రయాణమైంది.

'ఈ బట్టలకేం బ్రహ్మాండంగా ఉన్నాయి' అన్నాడు రాఘవరెడ్డి.

'రాత్రి నేనే యేదో అన్నానని ఎన్‌కరేజింగ్‌గా మాట్లాడనవసరం లేదు బావా! చింకిపాతలతోనైనా పెళ్ళికి వస్తాను. మా ప్రమీలకూ నాకూ ఉన్న అనుబంధం అలాటిది.' అన్నది నవ్వుతూ.

రాఘవరెడ్డి పెళ్ళింట్లో అడుగు పెట్టిన తర్వాత ఆడవాళ్లందరినీ పరకాయించి చూశాడు. రామలక్ష్మి పెళ్ళికి రావడానికి ఎందుకు సంకోచించిందో స్పష్టంగా అర్థమయింది. అందరి ఆడవాళ్ళ వంటి మీదా నగలున్నాయి. కొందరివి అరువు నగులు కావచ్చు. అందరూ ఖరీదయిన చీరలే కట్టుకొని రెపరెప తిరుగుతున్నారు.

రామలక్ష్మి ఒక్కతే నిరాడంబరంగా ఉన్నది. రామలక్ష్మి అయినా పెళ్ళింటికి చేరిన తర్వాత నగలూ, చీరెలూ గురించి అంత పట్టించుకున్నట్టు లేదు. ఉత్సాహంగా, సంతోషంగా నలుగురిలో తిరుగుతోంది.

ఏదో సినిమాలో అన్నట్లు ఇది వేగయుగం. టకటకా పెళ్ళయిపోయింది. మరోగంటకు భోజనాలయాయి. వచ్చిన చుట్టపక్కాలు పెట్టే బేడా సర్దుకొని ఇళ్ళకు ప్రయాణమవుతున్నారు.

రాఘవరెడ్డి రామలక్ష్మి దగ్గరకి వెళ్ళి, 'యేమ్మా మనం కూడా పోదామా?' అన్నాడు.

'యేమాలస్యం జరిగినా ఆయన ఉగ్ర నరసింహావతారం దాలుస్తారు. నేను కూడా వస్తాను. ఒక ఫ్రెండ్‌తో మాట్లాడి ఇప్పుడే ప్రమీల గదిలోకి వస్తాను. మీరు అక్కడే ఉండండి' అంది.

రాఘవరెడ్డి ప్రమీల గదిలోకి వచ్చాడు. గదిలో ఎవ్వరూ లేరు. కొత్త పెళ్ళికూతురు ప్రమీల – పెళ్ళిలో తనకు వచ్చిన కానుకల్ని భద్రపరుస్తోంది. స్టీలు తట్టలు, వెండి గ్లాసులు, పట్టు చీరెలు ఇంకా ఏవేవో చాలానే ఉన్నాయి.

చదివింపుల్లో నీకొచ్చిన కానుకల్ని చూస్తుంటే నాకు కళ్ళుకుడుతున్నాయి ప్రమీలా' అన్నాడు రాఘవరెడ్డి. ప్రమీల బాహ్య ప్రపంచంలోకి వచ్చి, 'నువ్వా బావా! రా, రా, కూర్చో' అంది.

'కూర్చుంటాను. కొత్త పెళ్ళికూతురు వేషంలో నిన్ను చూసినా, నీకు వచ్చిన కానుకల్ని చూసినా, కళ్ళు చల్లబడుతున్నాయి. ఇలా ఎంతసేపయినా కూర్చుంటాను' అన్నాడు రాఘవరెడ్డి నవ్వుతూ.

ప్రమీల పరవశించిపోయింది.

తనకు వచ్చిన కానుకల్ని ఏరి రాఘవరెడ్డి ముందు ఉంచి 'చూడు బావా' అంది.

అందులో రాఘవరెడ్డి చదివించిన చీరె కూడా ఉంది. 'అయితే నేను చదివించిన చీరె కూడా నీకు నచ్చిందన్నమాట బ్రతికిపోయాను' అన్నాడు రాఘవరెడ్డి.

'మా అక్క సెలెక్టు చేసిందో నువ్వు చేశావో తెలీదుకాని బాగుంది బావా' అంది.

ప్రమీల తన ముందుంచిన చీరెలూ అవీ చూస్తున్నాడు రాఘవరెడ్డి. ప్రమీల ప్రక్కనున్న ఒక రవికగుడ్డ రాఘవరెడ్డి మీదికి విసిరి 'అది చూడు బావా రామలక్ష్మి చదివించింది' అన్నది.

'సింపుల్‌గా బాగుంది ప్రమీలా, కానుకలంటే ఇలాగే ఉండాలి' అన్నాడు రాఘవరెడ్డి.

'మరదలని సమర్థించకు బావా, అది చూస్తే నాకు వళ్ళు మండుతోంది. ఆ ముష్టి రవిక గుడ్డకు నేనేమన్నా మొగం వాచాననుకుందేమో. అది చదివించి నన్ను అవమానించేకంటే, ఊరుకుంటే నేను సంతోషించేదాన్ని. మళ్ళీ దాని మాటలు చూడు ఎక్కడలేని ఆప్యాయత ఒలకబోస్తుంది. ఈ రవికగుడ్డ తీసి దాని మొఖాన కొట్టాలనిపిస్తోంది.'

రాఘవరెడ్డి హృదయం చివుక్కుమంది. ప్రమీలను ఎట్లా సమాధాన పరచాలో అతనికి బోధపడలేదు. వాకిట్లో ఏదో అలికిడి అయితే - తలెత్తి చూచాడు. రామలక్ష్మి వస్తోంది. రాఘవరెడ్డికి ముచ్చెమటలు ముంచెత్తి పోశాయి.

ఈ దేశంలో ఆడవాళ్ళకి చదువు అబ్బుతోంది కానీ, సంస్కారం అబ్బడం లేదు. ప్రమీల రామలక్ష్మిని పట్టుకొని ఎక్కడ ఝాడిస్తుందో ఏమోనని రాఘవరెడ్డికి గుండెదడ పట్టుకుంది. వెంటనే లేచి 'అదిగో రామలక్ష్మి కూడా వస్తోంది. మే మిద్దరం ఊరికి వెళ్తున్నాం. బస్సుకు టైం అయిపోయింది. వస్తాం ప్రమీలా' అంటూ గబగబా మాటలు వప్పగించాడు. రామలక్ష్మి తరపున కూడా రాఘవరెడ్డి సెలవు తీసుకున్నాడు. ప్రమీల గడప వరకు వచ్చి 'వెళ్ళిరండి' అంది.

రాఘవరెడ్డి, రామలక్ష్మిని వెంటబెట్టుకొని బస్సు స్టాండుకు వచ్చాడు. అప్పటికిగాని అతనికి గుండెదడ తగ్గి, కాస్త స్థిమితం చిక్కలేదు. రాఘవరెడ్డి తలెత్తి రామలక్ష్మి ముఖంలోకి చూచాడు.

రామలక్ష్మి ఏదో ఆలోచిస్తోంది.

'ఏమిటమ్మా ఆలోచిస్తున్నావు?' అన్నాడు రాఘవరెడ్డి.

'ఏమీలేదు. ఈ రోజు ఒక విషయం కనుక్కున్నాను. అది నీకు కూడా చెప్పనా?' అంది రామలక్ష్మి.

'ఏమిటమ్మా అది?'

'మనకు ఒకరిపట్ల మనసులో ఆప్యాయత, అనురాగం ఉండవచ్చు. కానీ దాన్ని వ్యక్తం చేయడానికి కూడా డబ్బు కావాలి. నిజమా కాదా బావా?' అంది రామలక్ష్మి.

రామలక్ష్మి కంఠంలో గాద్గదికత స్పష్టంగా కనిపిస్తోంది. ప్రమీల అన్న మాటలు రామలక్ష్మి విన్నదని రాఘవరెడ్డికి చప్పున బోధపడింది. ఆ విషయంమీద చర్చలేపి, రామలక్ష్మి గుండెల్ని మరీ పిండడం రాఘవరెడ్డికి ఇష్టంలేదు.

'రామలక్ష్మి అదిగో మనబస్సు వస్తోంది' అంటూ మాట తప్పించాడు.